క్లుప్తంగా

భూహక్కు చట్టం పునఃపరిశీలించాలి



ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ప్రజల భూ ఆస్తులకు విఘాతం కలిగేలా ప్రభుత్వం నూతన భూ హక్కు చట్టాన్ని తెచ్చిందని, దీని వల్ల రైతులకు తమ భూములపై రక్షణ కరువయ్యే పరిస్థితి ఉందని పలువురు న్యాయవాదులు అన్నారు. ఈ భూ హక్కు చట్టాన్ని ప్రభుత్వం పునః పరిశీలించాలని కోరుతూ శనివారం పట్టణంలో పలువురు న్యాయవాదులు రైతులతో కలిసి ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయం ఎదుట కొంత సేపు నిరసన నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ మధులతకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీతో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పంచాయతీకి జీఎంకే ట్రస్ట్ 75 వీధిలైట్ల వితరణ



గ్రామ పంచాయతీకి వీధిలైట్లు అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం గ్రామ పంచాయతీకి జీఎంకే ట్రస్ట్ అధినేత, వైస్ ఎంపీపీ గుంటుపల్లి మాలకొండయ్య చౌదరి తన సొంత నిధులతో రూ.లక్ష విలువ చేసే 75 ఎల్ఈడీ విద్యుత్ లైట్లను శనివారం తన ప్రతినిధుల ద్వారా అందజేశారు. ప్రతినిధులు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలు గాలులకు వీధిలైట్లు కాలిపోయాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సర్పంచ్ గొల్లపల్లి కల్పన జీఎంకే దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు బి.వెంకటేశ్వర్లు, షేక్ గఫూర్, మహేష్, స్థానికులు రమేష్, రామారావు రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంధమహోత్సవం



ప్రత్యేక ప్రార్థనల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు

అల్లూరు: స్థానిక మసీద్ సెంటర్‌లోని నాగూరు ఖాదర్‌వలి దర్గా చెట్టు వద్ద శుక్రవారం రాత్రి గంధమహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. విద్యుత్ దీపాలంకరణ, తీన్‌మార్ బ్యాండ్, తెనాలి బ్యాండ్, గుర్రపు స్వారీతో గంధాన్ని ఊరేగించారు. అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్, పట్టణాధ్యక్షుడు దండా కృష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ షేక్ ఉస్మాన్‌షరీఫ్, వెస్ట్ బ్యాంక్ సొసైటీ చైర్మన్ భక్తవత్సలరెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు షేక్ మసూద్, షన్నా, సాబీర్, షబ్బీర్, సంధాని, సుల్తాన్, అబ్దుల్లా, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

అలజడి సృష్టిస్తే చర్యలు



ఎస్సై పి శ్రీనివాసులరెడ్డి

అల్లూరు: నూతన సంవత్సర వేడుకల పేరుతో అలజడులు సృష్టిస్తే చర్యలు తప్పవని ఎస్సై పి.శ్రీనివాసుల రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిసెంబర్ 31 రాత్రి అంతా పోలీస్ యంత్రాంగం నిఘా పెడుతుందన్నారు. న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా ఇళ్ల వద్దనే జరుపుకోవాలన్నారు. ద్విచక్ర వాహనాలపై కేకలు వేస్తూ, అధిక శబ్దాలతో హోరెత్తించడం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అశ్లీల నృత్యాలు, అసాంఘిక, అసభ్యకర కార్యక్రమాలకు పాల్పడినా, మద్యం తాగి కార్లు, బైక్‌లను అతివేగంగా నడిపినా కేసులు తప్పవన్నారు.

సిమెంట్ బెంచీల వితరణ



గురుకుల పాఠశాలకు అందజేసిన సిమెంట్ బెంచీలు

ఆత్మకూరు: పట్టణంలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలకు విద్యార్థుల సౌకర్యం కోసం దాత చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ 8 సిమెంట్ బెంచీలను శనివారం అందజేశారు. గత నెలలో కళాశాల ప్రిన్సిపల్ కామేశ్వరి ట్రస్ట్ నిర్వాహకులను పాఠశాలలో విద్యార్థుల సౌకర్యం కోసం సిమెంట్ బెంచీలు కావాలని కోరిన నేపథ్యంలో దాతలు అందజేసినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

అల్లర్లే టీడీపీ టార్గెట్

- ఓటమి భయంతో కవ్వింపు చర్యలు
- దాడులతో భయభ్రాంతులు చేసే దురాలోచన

సార్వత్రిక ఎన్నికలకు పట్టుమని వంద రోజులు కూడా లేవు. ఈ దశలో ఎన్నికల క్షేత్రంలో టీడీపీ గెలుపు కనుచూపు మేరలో కనిపించడం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై, సీఎం జగన్‌పై పచ్చ పార్టీ నేతలు, పచ్చ మీడియా ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజలు నమ్మడం లేదు. పలు జాతీయ సర్వే సంస్థలు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టడం ఖాయమని చెబుతున్నాయి. ఒక వైపు ఎన్నికలు సమీపిస్తుండం, ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా ప్రజల్లో అధికార పార్టీకి ప్రజాదరణ చెక్కు చెదరకపోవడంతో ఆ పార్టీ నేతలు సహనం కోల్పోతున్నారు. అల్లర్లు, దాడులు, గొడవలను ప్రేరేపిస్తూ రాష్ట్రంలో శాంతి భద్రతలు దిగజారిపోయాయని ప్రచారం చేసేందుకు దిగజారుడు రాజకీయలకు టీడీపీ పక్కా స్కెచ్‌తో ఉన్నట్లు నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

ఉదయగిరి: 2019 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని ప్రజలు చిత్తుగా ఓడించారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చుతూ నవరత్నాలు పేరుతో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారు. అధికార, ప్రతిపక్షాలనే తేడా లేకుండా అర్హతే ప్రామాణికంగా అన్ని పథకాలు అందరికీ అందేలా పాలన చేస్తున్నారు. రెండేళ్ల కరోనా కష్ట కాలంలో కూడా సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల గుండెల్లో నిలిచారు. ఏ ఎన్నికలు జరిగినా రాష్ట్ర ప్రజలు వైఎస్సార్‌సీపీని ఆదిరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి భయంతో టీడీపీ నియోజకవర్గాల్లో కవ్వింపు చర్యలకు తెగబడుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉద్దేశపూర్వకంగా అశాంతి వాతావారణాన్ని సృష్టించేందుకు కుట్రలు చేస్తోంది. పార్టీ పెద్దల ఆలోచనకు అనుగుణంగా నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదేశాల ప్రకారం పచ్చ పార్టీ నేతలు అల్లర్లు సృష్టిస్తున్నారు. ఉదయగిరిలో శుక్రవారం జరిగిన ఘటన ఇందుకు నిదర్శనం.

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉదయగిరిలో టీడీపీ తరఫున పోటీ చేసిన బొల్లినేని వెంకటరామారావు ఘోర పరాజయం చెందారు. ఎన్నికల తర్వాత నుంచి ఆయన పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నారు. మొదట్లో 2024 ఎన్నికల్లో పోటీ చేసేందుకు కూడా ఆసక్తి చూపలేదు. అయితే నియోజకవర్గంలో ఇటీవల చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల క్రమంలో మళ్లీ పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మేకపాటి కుటుంబానికి ఉదయగిరి ప్రజల ఆదరణ బలంగా ఉండడంతో గెలుపు అంతా సులువుగా లేకపోవడంతో గొడవలు, అల్లర్లు సృష్టించి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉదయగిరిలో మూడు రోజుల నుంచి బొల్లినేని తన పార్టీ నేతలతో కలిసి టీడీపీ ప్రచార కార్యక్రమం చేపట్టారు. అయితే ప్రజల నుంచి ప్రభుత్వంపై వ్యతిరేకత కనిపించకపోగా, బాబు పాలనలో తమకు జరిగిన అన్యాయం గురించి అక్కడక్కడ మహిళలు నిలదీస్తుండంతో తాను చేపట్టిన కార్యక్రమం ఫ్లాప్ అయింది. దీంతో ప్రభుత్వంపై బురద చల్లే కార్యక్రమంలో భాగంగా ఉదయగిరి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీ ఓబులరెడ్డి సమీప బంధువు, హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగి హర్షవర్ధన్‌రెడ్డిని టార్గెట్ చేశారు. అతను ఉదయగిరి శ్రీనగర్‌లో ఇల్లు నిర్మించుకుంటూ రూ.32 లక్షలకు బేల్దారి మేస్త్రీ బి.శ్రీనివాసులకు కాంట్రాక్ట్ ఇచ్చారు. అయితే ఆ ఇంట్లో ప్రభుత్వం సరఫరా చేసే సిమెంట్ బస్తాలు ఉన్నాయంటూ పార్టీపై బురద చల్లేందుకు ప్లాన్ వేసుకున్నారు. పార్టీ ప్రచారం కార్యక్రమం పేరుతో బొల్లినేని మీడియా, స్థానిక నేతలతో కలిసి శుక్రవారం హర్షవర్ధన్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. ప్రభుత్వానికి చెందిన సిమెంట్ వాడుతూ అవినీతికి పాల్పడుతున్నారంటూ ఆరోపిస్తూ వైఎస్సార్‌సీపీ నేతలను, ప్రభుత్వాన్ని విమర్శిస్తూ నానా యాగి చేశారు. విషయం తెలుసున్న హర్షవర్ధన్‌రెడ్డి బొల్లినేని వద్దకు వెళ్లి తాను ఇంటి నిర్మాణాన్ని కాంట్రాక్ట్‌కు ఇచ్చానని, తనపై ఎందుకు తప్పుడు ఆరోపణలు చేస్తారని నిలదీసినా పట్టించుకోలేదు. కేవలం అధికార పార్టీని బదానం చేస్తూ పట్టణంలో టీడీపీకి మైలేజీ పొందేందుకు ప్రయత్నించారు. టీడీపీ చేసిన ఛీప్ పాలిటిక్స్ అభాసు పాలుకావడంతో ఆ పార్టీ నేతలకు మరింత చిర్రెత్తించింది. దీంతో సాయంత్రం పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో కన్వీనర్ ఓబులరెడ్డి కొంత మంది స్థానిక దళిత నేతలతో కలిసి టీ తాగుతుండగా టీడీపీ నేత, మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి తమ అనుచరులతో వచ్చి కవ్వింపు చర్యలకు పాల్పడి దాడి చేశారు. ముఖ్యంగా దళిత నేత గురవయ్య, ఓబులరెడ్డిను టార్గెట్ చేస్తూ పిడిగుద్దులు గుప్పిస్తూ స్థానికుల్లో భయభ్రాంతులు కలిగించే ప్రయత్నం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు చౌకబారు రాజకీయంతో ప్రజల్లో ఎంతో ఛీప్ అయ్యారో, ఉదయగిరిలో బొల్లినేని చేసే ఛీప్ రాజకీయాలతో ప్రజల్లో మరింత ప్రజాదరణ కోల్పోతున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు.



ఉదయగిరిలో టీడీపీ చేస్తున్న ఛీప్ రాజకీయాలపై శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్న మేకపాటి రాజారెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

జగనన్నతోనే రాష్ట్రం మరింత సుభిక్షం

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి

కావలి: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పనులు మరింత సమర్థవంతంగా అమలు చేసి రాష్ట్రం సుభిక్షంగా సుస్థిరంగా ఉండడానికి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని 13వ వార్డులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి ఎమ్మెల్యే వెళ్లి గడిచిన నాలుగున్నర ఏళ్ల కాలంలో ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలు వివరాలు తెలియజేసే బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య, ఉపాధి, ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్ నిరంతరం పని చేస్తున్నారన్నారన్నారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి వృద్ధులకు, మహిళలకు జగన్ ప్రభుత్వం రూ.3 వేల పింఛన్‌ను అందించనున్నారని, ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో సీఎం వైఎస్ జగన్‌కు ఎవరూ సాటి రారు అనడానికి ఇదే నిదర్శనమని వెల్లడించారు. గత ప్రభుత్వంలో కేవలం పసుపు చొక్కాలు వేసుకున్న వారు లంచాలు తీసుకుని పథకాలు ఇచ్చారని, సీఎం వైఎస్ జగన్ మాత్రం కుల, మతాలకు అతీతంగా సంక్షేమాన్ని అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి టీడీపీ గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందజేసే విషయంలో చంద్రబాబు ఎన్నో డ్రామాలు ఆడారని మండిపడ్డారు. చంద్రబాబు పేరు చెబితే ఒక్క స్కీమ్ గుర్తుకు రాదని, పవన్ కల్యాణ్‌ది జనసేన కాదని, భజన సేన అని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొండ బిట్రగుంట ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, డాక్టర్ శ్రీరాం మనోహర్‌బాబు, మండలి కృష్ణారావు, కుందుర్తి శ్రీనివాసులు, డేగా రామయ్య యాదవ్, షేక్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ కోటారెడ్డి

సంగం: సంగం పోలీస్‌స్టేషన్‌ను ఆత్మకూరు డీఎస్పీ ఎస్ కోటారెడ్డి శనివారం తనిఖీ చేశారు. తొలుత సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ పరిసరాలను, అనంతరం రికార్డులు పరిశీలించారు. సిబ్బంది పనితీరును ఎస్సై నాగార్జునరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత్త చర్యలు చేపడుతున్నామన్నారు. నూతన సంవత్సర వేడుకలతో ఇతరుల స్వేచ్ఛకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఆయన వెంట సంగం సీఐ రవినాయక్ ఉన్నారు.

చేజర్ల: చేజర్ల పోలీస్‌స్టేషన్‌ను ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నూతన సంవత్సర వేడుకల ముసుగులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట సంగం సీఐ రవినాయక్, చేజర్ల ఎస్సై ప్రభాకర్, సిబ్బంది ఉన్నారు.

చోరీకి దుండగుల విఫలయత్నం

- యాజమాని అప్రమత్తతతో పరారైన దుండగులు



చోరీ యత్నం జరిగిన నివాసంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

సంగం: సంగం దువ్వూరు కాలువ సమీపంలో నివాసముంటున్న శ్రీనివాసులు ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు. ఆటోలో వచ్చిన దుండగులు గడ్డపారతో ఇంటి తలుపులు పగులకొడుతుండగా శబ్దాలు విన్న ఇంటి యజమాని వెంటనే 100 ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు రావడాన్ని గమనించిన దుండగులు వెంటనే ఆటోలో పరారయ్యారు. ఎస్సై నాగార్జునరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు. దుండగుల కోసం తమ సిబ్బందితో గాలింపు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. క్లూస్ టీమ్ ఇంటి వద్దకు వచ్చి ఆధారాలు సేకరించారు.

జనవరి 2 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

బిట్రగుంట: బోగోలు మండలంలో జనవరి 2వ తేదీ నుంచి నిర్వహించనున్న రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ వెంకటసుబ్బారావు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్షపై వైద్యారోగ్యశాఖ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య భద్రత, మెరుగైన వైద్యసదుపాయాలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. సచివాలయాల వారీగా వైద్యశిబిరాలు నిర్వహించే తేదీలపై ముందుగానే ప్రజలకు తెలియజేయాలని సూచించారు. కోవూరుపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ హారిక మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష తొలి విడతలో మాదిరిగానే ఈ దఫా కూడా నిపుణులైన వైద్యులు వైద్యశిబిరాల్లో సేవలందిస్తారని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

- సోమశిల: అనంతసాగరం మండలంలో జనవరి 2వ తేదీ నుంచి రెండో విడత ఆరోగ్య సురక్ష క్యాంపులు జరగనున్నట్లు ఎంపీడీఓ ఏ మధుసూదన్‌రావు శనివారం తెలిపారు. జనవరి 2న అనంతసాగరం, 9న లింగంగుంట 19న ఆమనిచిరువెళ్ల, 23న దేవరాయపల్లి బిట్–2, 30న కొత్తపల్లి, ఫిబ్రవరి 6న మినగల్లు, 13న రేవూరు 20న మంచాలపల్లి, 27న పాతాళపల్లి, మార్చి 5న ఉప్పలపాడు, 12న పడమటికంభంపాడు, 19న సోమశిల, 26న కామిరెడ్డిపాడు, ఏప్రిల్ 2న చిలకలమర్రి, 12న బొమ్మవరం గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు జరుగుతాయని ఆయన తెలిపారు.
- ఉదయగిరి: మండలంలోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో జనవరి 2వ తేదీ నుంచి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు జరుగుతాయని ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ రోజు ఏ సచివాలయాల పరిధిలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారనే విషయాన్ని ముందుగా తెలియజేస్తామన్నారు. ఇందుకు సంబంధించి వైద్య బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

3 నుంచి పెంచిన పింఛన్లు పంపిణీ

సోమశిల: ప్రతి నెల 1వ తేదీ వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు ఇతర వృత్తుల వారికి పింఛన్లు పంపిణీ చేస్తున్న విషయం విదితమే. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనవరి నుంచి రూ.3 వేలకు పెంచి పింఛను అందజేసేందుకు శ్రీకారం చుట్టారు. అనంతసాగరం మండలంలో ఈ నెల 3న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ మధుసూదన్‌రావు శనివారం తెలిపారు. అనంతరం గ్రామాల్లో పెంచిన పింఛను పంపిణీ చేస్తారని తెలిపారు. 1వ తేదీ పింఛన్ల పంపిణీ ఉండదన్నారు. ఈ విషయాన్ని లబ్ధిదారులు గమనించాలని కోరారు.

నేడు తెల్లపాడులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కలిగిరి: మండలంలోని తెల్లపాడు సచివాలయం పరిధిలో ఆదివారం గడపగడపకు మన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి శనివారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

మద్యం పట్టివేత

సీతారామపురం (ఉదయగిరి): సీతారామపురం బస్టాండ్ సెంటర్‌లో అక్రమంగా మద్యం నిల్వ చేశారనే సమాచారంతో శనివారం ఎస్సై అనూష మారువేషంలో వెళ్లి దాడి చేశారు. శవపేటికలో నిల్వ ఉంచిన 16 బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితుడు ఏడుకొండలును అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నవజ్యోతి మల్లెన్నకు ఘన సత్కారం



మల్లేశ్వరరావును సత్కరిస్తున్న పోసాని కృష్ణమురళి తదితరులు

కావలి: పట్టణానికి చెందిన ప్రముఖ నాటక రచయిత, దర్శకుడు, నటుడు ఏవీ మల్లేశ్వరరావును శుక్రవారం రాత్రి గుంటూరులో జరిగిన నంది నాటకోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. యాభై సంవత్సరాలుగా నాటక రంగానికి తన జీవితాన్ని అంకితం చేసి, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన మల్లేశ్వరరావు నవజ్యోతి మల్లెన్నగా ప్రసిద్ధులు. నంది నాటకోత్సవాల్లో మల్లేశ్వరరావు బాలల నాటక పోటీల తుది న్యాయనిర్ణేతగా, ఎన్టీఆర్ డాక్టర్ వైఎస్సార్ రంగస్థల పురస్కారాల ఎంపిక కమిటీ సభ్యుడిగా వ్యవహరించారు. ప్రముఖ సినీ రచయిత, నటుడు, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోసాని కృష్ణమురళి, ఇతర ప్రముఖులు మల్లెన్నను ఘనంగా సత్కరించారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న దృశ్యం

అనుమసముద్రంపేట: మండలంలోని గుంపర్లపాడు జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు శనివారం ట్యాబ్‌లను ప్రజాప్రతినిధులు అందజేశారు. సర్పంచ్ వనిపెంట రంగారెడ్డి, ఎంపీటీసీ ముడిస్వాతి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సిరిగిరి మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సిరిగిరి వెంకటేశ్వర్లురెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సాంకేతికతో విద్యను అందించేందుకు ట్యాబ్‌లు అందజేస్తున్నారన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూరు శాతం ఫలితాల సాధనకు కృషి చేయాలి



తరగతి గదులు వసతులను పరిశీలిస్తున్న ఆర్ఐఓ

ఉదయగిరి: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని ఆర్ఐఓ ఆర్.శ్రీనివాసులు, డీవీఈఓ మధుబాబు తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సందర్శించారు. ఫిబ్రవరి, మార్చిలో జరిగే ఇంటర్ ప్రాక్టికల్స్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన తరగతి గదులు ల్యాబ్ మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 51 వేల మంది విద్యార్థులు ఇంటర్ ప్రథమ ద్వితీయ సంవత్సర పరీక్షలకు హాజరవుతారన్నారు. వెనుకబడిన విద్యార్థులపై అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కిరణ్ అధ్యాపకులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షతలకు ఘన స్వాగతం



మహిమలూరులో ఊరేగింపుగా తీసుకొస్తున్న అయోధ్య అక్షతలు

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరుకు చేరుకున్న అయోధ్య అక్షతలకు గ్రామస్తులు, భక్తులు మేళతాళాలతో శనివారం ఘనంగా స్వాగతం పలికారు. స్థానికంగా ఉన్న ఆంజనేయస్వామి గుడి నుంచి వేణుగోపాలస్వామి దేవాలయం వరకు రామకీర్తనలు పాడుతూ మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు యానాదిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యం



దుత్తలూరు: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడమే క్విజ్ పోటీల లక్ష్యమని సీడ్స్ సంస్థ వ్యవస్థాపకులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చంద్రమౌళీశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక సీడ్స్ సంస్థలో సీడ్స్ సంస్థ జిల్లా స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. మొదటి బహుమతిని బ్రాహ్మణకాక జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రూ.20 వేలు, ద్వితీయ బహుమతిని వింజమూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రూ.15 వేలు, తృతీయ బహుమతి జలదంకి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రూ.10 వేలు, నాలుగో బహుమతిని గుండెమడకల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రూ.5 వేలు సాధించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన ర్యాలీ

ఆత్మకూరు: తమ న్యాయమైన కోర్కెలు ప్రభుత్వం పరిష్కరించాలని నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న ఆత్మకూరు మున్సిపల్ పారిశుధ్య కార్మికులు శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వద్ద నుంచి మున్సిపల్ బస్టాండ్‌లోని అంబేడ్కర్ బొమ్మ వరకు ర్యాలీ చేశారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, ఆరోగ్య రక్షణ, తదితర కోర్కెలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. సీపీఎం రైతు కూలి సంఘం, సీఐటీయూ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో ఆక్రమణలు అరికట్టండి

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ స్థలాల ఆక్రమనలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించి స్వాధీనం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు, మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావుకు శనివారం వినతి పత్రం అందజేశారు. సర్వే నంబరు 992, 1070, తదితర డొంక పోరంబోకు, పంట కాలువలు ప్రభుత్వ స్థలాలైనా వాటిని ఆక్రమించి పలువురు నిర్మాణాలు చేపట్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నం నాగరాజు, భార్గవ్, ప్రకాష్, రాంకీ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన

చేజర్ల: మండలంలోని పోలింగ్ కేంద్రాలను మండల సెక్టోరల్ ఆఫీసర్లు శనివారం పరిశీలించారు. మండలంలోని మడపల్లి పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ కృష్ణ పరిశీలించి మాట్లాడుతూ పోలింగ్ కేంద్రంలో కరెంట్, నీటి వసతి, ఇంటర్నెట్ సౌకర్యం ఉండాలని స్థానిక అధికారులను ఆదేశించారు. రోడ్డు సౌకర్యం, రాత్రి బస చేసేందుకు వసతులపై ఆరా తీశారు.